
# విముఖము




— బాలచంద్ర

అభయ ఫౌండేషన్

# విముఖము

## బాలచంద్ర

Published by

**abhaya FOUNDATION**

Hyderabad - 500 004. TS

www.abhayafoundation.org

# VIMUKHAM

Author : **Balachandra**

Copy Right © Balachandra

All rights reserved. No part of this work may be reproduced in any form without written permission of the publisher

First Edition : January, 2024
Copies : 1000
Price : Invaluable

Published by
**abhaya FOUNDATION**
6-3-609/140/1, Anandnagar, Khairathabad,
Hyderabad - 500 004. Telangana
abhayafoundation@yahoo.com | abhaya@abhayafoundation.org
Mobile: 99592202450 | What's App: 8143707803

www.abhayafoundation.org | www.abhayahome.org
fb: abhayafoundationHyd
fb Page: abhaya Foundation - Home of Happiness
Twitter: abhayaheart | Youtube: abhayaheart

Printed at :
Dolphin Graphics
IDA, Uppal, Hyderabad - 500 039, TS
dolphingraphicsads@gmail.com
Ph: 8106988009

# హిమగంగలో కరగాల్సింది
# మంచా? మనిషా??

**(ఋషికేశ్ క్షేత్రం...**
**పావన గంగా తీరంలో స్నానం చేసి కూర్చుంటే...**
**గుండెలో మెదలిన భావాలు ఇవి)**

సేవాకార్యంలో నన్ను నేను మరచిపోయాను
స్వీయ శ్రేయస్సును కూడా కాదనుకున్నాను
స్వయం ప్రేరితుడినై సొంత పనులొద్దనుకున్నాను
సాయం చేస్తూ... ఆరోగ్య ధ్యాస వదిలేసాను

అయిన వాళ్లకు దూరంగా వెళ్లాలనుకున్నా...
అందుబాటులో లేకుండా పోవాలనుకున్నా...
అర్థం... పరమార్థం వెతుక్కోవాలనుకున్నా...
హిమాలయాల్లో హేమ చంద్రుడవ్వాలనుకున్నా!

ఆత్మీయులెందరో అనునయించి చెప్పినారు
సేవతో పాటు సాధన నిష్ఠగా చేయమన్నారు
స్వామి రామ కేంద్రం దర్శించే అవకాశమొచ్చింది
సద్భావనతో సాధనకు నేను శ్రీకారం చుట్టాను

విమానాశ్రయము నుండి ఆశ్రయము కోరి వచ్చా
స్వామి రామ ఆశ్రమములో ఆరామము కోరాను
వున్నన్ని రోజులు సేవ గురించిన ఆలోచనలే
యోగధ్యానము ఒంట పట్టనే లేదని గ్రహించా

హిమాలయ విశ్వ విద్యాలయములో సమయం
హితమైన విశ్వమునకై శోకించిన హృదయం
పరహితకాంక్షే పరమార్థమని భేదించిన స్వగతం
పరమాత్మదయకై క్లేశముతో చేరాను ఋషికేశం

పావనగంగా తీరంలో... గుండె లోతుల్లో మునిగాను
పాప పంకిలమవుతున్న మనుషుల కోసమై తపించాను
లోప భూయిష్టమైన జీవితానికి కారణాలు వెతికాను
లోనే వుండి కాల్చే అరిషడ్ వర్గాల నరికట్టాలను కున్నాను

కామము... కారణము!
క్రోధము... విరోధము
లోభము... లాభమా?
మోహము... మోసమే
మదము... ప్రమాదము
మత్సరము... మరణమే!!

ఇది స్వగతం కాదు... కానే కాదిది గతం
ఇది మన జీవిత సాఫల్యానికి స్వాగతం
ఆరు రోజులు ఆర్తితో అర్థించి అర్చించెదను
ఆరు శత్రువులతో చేసే క్రతువుకు రూపం విముఖము

॥ సమస్త లోకాః సుఖినోభవంతు ॥

ప్రేమతో...
**బాలచంద్ర**

7 నవంబరు 2023
ఋషికేశ్

## విషయసూచిక...

| | | |
|---|---|---|
| | హిమగంగలో కరగాల్సింది మంచా? మనిషా?? | 3 |
| 1. | కామము... కారణము! | 7 |
| 2. | క్రోధము... విరోధము! | 15 |
| 3. | లోభము... లాభమా? | 25 |
| 4. | మోహము... మోసమే! | 35 |
| 5. | మదము... ప్రమాదము! | 43 |
| 6. | మత్సరము... మరణమే! | 51 |
| | జ్యోత్స్న... వెలుగు బాటలో పయనం | 57 |

# 1. కామము... కారణము!

సృష్టికి మూలం కామము. కామమే సర్వ జగత్ కారణం. పంచ భూతాలు మాత్రమే వ్యాపించిన విశ్వములో ఆ విష్ణు సంకల్పానికి ఈ కామమే (కోరిక) కారణం అని చెప్పాలి. మనిషిని సృష్టించిన దేవుడు సంకల్ప వికల్పాలకు తావు లేకుండా పుట్టిన ప్రాణి ఏమి చేయగలదని యోచించి జీవుల అంతరంగంలో రహస్యముగా అరిషడ్వర్గములను చొప్పించి ప్రపంచములో వారిని ప్రవేశ పెట్టాడు. ఇక ఆట మొదలు అయింది ఆ నాటి నుండి. సూత్రధారి దేవుడు... పాత్రధారి జీవుడు అయ్యారు.

## దుష్కామః చిత్త వృత్తి వినాశనః

లోనే వుండి మనిషిని ఆడించే ఈ అరిషడ్వర్గాలు జీవుని యొక్క అధోగతికి మరియు పురోగతికి కారణం అవుతున్నాయి. తన జీవితం ఈ ఆరు శక్తుల స్వాధీనంలో వున్నదని గ్రహించలేని మనిషికి వాటి చెర నుండి తప్పించుకుని బ్రతకడం అసాధ్యం అవుతుంది. ఎవరైతే ఈ శక్తులను మచ్చిక చేసుకుని తమ ఆధీనంలో పెట్టుకో గలరో ఇక

వారిలో సృష్టి సహజంగా సంక్రమించిన మనుష్యత్వము మాయమై దివ్యత్వము సిద్ధిస్తుంది. కానీ ఈ ప్రస్తుత ప్రపంచములో అట్టి వారిని చూడటం అరుదు అనే చెప్పాలి.

సృష్ట్యాది నుండి ఈ అరిషడ్వర్గములను జయించాలని ఎందరో ప్రయత్నాలు చేస్తూనే వున్నారు... చాలా కొద్ది మంది మాత్రమే సాధించారు అని చెప్పుకోవాలి. కారణం, అలా దివ్యత్వం సిద్ధించిన వాళ్ళు మన కళ్ళకు కనబడరు కదా! ఒక వేళ కనిపించినా మనకు తెలియాలి కదా! ఇక మేము అట్టి వారమే అంటూ కనిపించే వాళ్ళల్లో ఏదో ఒక రూపములో ఈ అరిషడ్వర్గములు ప్రకటితము అవుతూనే వుంటాయి. ఎవరైనా మేము వాటిని జయించేసాము అని చెప్పినా, వారిలో ఏదో ఒక దుర్లక్షణము కనిపిస్తూ వారి నిజ స్వరూపాన్ని గోచరింప చేస్తూ వుంటుంది. ఇది అందరికీ అర్థం అయ్యే విషయమే కదూ?

“కామము” అంటే కోరిక అని చెప్పొచ్చు. ఏదైనా చేయాలన్న కోరికయే మనిషి యొక్క జీవితాన్ని నిర్దేశిస్తుంది. మంచి కోరిక మంచి ఫలితాన్ని ఇచ్చినట్లే... చెడు కోరిక చెడు ఫలితాన్ని ఇస్తుంది. కామము ఉంటే జీవితములో ఇక అన్ని “,” లే సుమా! చుక్కలు ఉండవు. ముగింపు వుండదు. అంతులేని కోరికల వలలో చిక్కి మనిషి తనను

తాను బలి చేసుకోవడమే ఇక అంతం.

పుట్టిన ప్రతి మనిషికి కోరికలు వుండడం సహజం. కోరికలు ఉంటేనే కదా మరి జీవనం సాగినట్టు? లేకపోతే ఎలా బ్రతికేది అని చాలా మందికి సందేహం కూడ వుంటుంది. అవును మరి. కోరికలు వుండాలి కాని, దానికి ఒక పరిమితి ఉండాలి. మరొక రహస్యం ఏమిటి అంటే ఈ కామాన్ని జయిస్తే గాని మనం ఆధ్యాత్మికంగా ముందుకు అడుగు వేయలేము. అలా జయించడము కూడా దుర్లభమే. అదే ఆధ్యాత్మికతయే కోరికగా పెట్టుకుని బ్రతుకుతే స్వామి కార్యం స్వకార్యం సిద్ధిస్తాయి

## కామి గాక మోక్షగామి కాడు!

పూర్వం నుండి మనము వింటున్నది, కంటున్నది, అంటున్నది ఏమిటి... "కామి కాని వాడు మోక్ష కామి కాలేడు!" అంటే కోరికలు తీర్చుకునే గతిలో చివరకు సత్య కాముడు అవుతామన్న మాట.

మనిషి జీవితము అంతా కూడా చతుర్విధ పురుషార్ధ సాధనకు అని తెలుసు కదా! ఏమిటి ఇవి, నాలుగు విధములైన విషయాలు, ధర్మము, అర్ధము, కామము మరియు మోక్షము. కానీ ఒకసారి తరచి చూస్తే నాలుగు పదాలు జతగా మారి రెండు సందేశాలు ఇస్తున్నాయి.

వాటిని గ్రహించ గలిగితే ఇక పరమార్థం గోచరిస్తుంది.

ధర్మ-అర్థము... అంటే జీవితములో ధర్మ బద్ధంగా జీవిస్తూ సంపాదించాలి. కామ-మోక్షము... అంటే ఎన్ని కార్యాలలో మనము వున్నా సరే, మోక్ష కామనలోనే జీవిస్తుండాలి.


ఒక సారి పరిశీలిస్తే నేటి మానవ జీవితములో మనం అందరం అధర్మ వర్తనులై... అనర్థములు కొని తెచ్చుకుంటూ... కోరికలను తీర్చుకునే ప్రక్రియలో మోక్ష లక్షమునే మరచి పోతున్నాం. ఇక ఈ కామం వ్యామోహంగా మారిపోతే ఇక జీవితం నాశనం అయినట్టే.

ధన వ్యామోహం... వస్తు వ్యామోహం... వ్యక్తి వ్యామోహం... బందు వ్యామోహం... అధికార వ్యామోహం... కీర్తి వ్యామోహం... ఇలా ప్రతి విషయం కూడా ఒక కాలకూట విషమై మనలను బ్రతికి ఉన్నప్పుడే కాల్చేస్తుంది.

ఆడ మగ రమించాలి అన్న కోరిక పర్యవసానం ఏమిటి? ఒక నిముషం సుఖాన్ని ఇస్తే, మిగతా 23 గంటలా 59 నిమిషాలు దుఃఖానికి హేతువు అవుతుంది. ఇదే సంసార బంధనముగా మారిపోతుంది. పరస్పర ప్రేరకమై... ఉత్ప్రేరకమై... తమకమై... ఒకరితో ఒకరిని మమేకం చేస్తుంది.

# కామా తురాణాం నభయం నలజ్జా!

ఇక అది వ్యామోహంగా మారితే ఏమవుతుంది? మనము చూస్తూనే వున్నాం కదా! అపుడెప్పుడో, కొత్తగా పెళ్లి చేసుకున్న రామ్‌ను వదిలి రత్నావళి అత్యవసరంగా పుట్టింటికి వెళ్లిందట. ఇంటికి వచ్చేసరికి రామ్‌కు భార్య కనబడలేదు. భార్య ఇచ్చిన సమాచారం తెలుసుకున్నాడు. అంతే ఇక... ఆగలేక పోయాడు... అప్పటికప్పుడే వర్షం వస్తున్నా ఆగకుండా బయలు దేరాడు... మార్గ మధ్యంలో నదిని ఈదుతూ వెళ్ళాడు అర్థ రాత్రి... అత్త గారింటికి చేరి... తలుపు కొట్టి తెరిచే లోపుగా కూడా ఉండలేక... సొంతం మేడ పైన వున్న భార్య గదిలోకి ఒక తాడు పట్టుకుని వెళ్లి పోయాడు. భార్య అలికిడికి లేచి చూస్తే... ఎదురుగా రక్తపు మరకలతో భర్త. బిత్తర పోయి... పరిశీలిస్తే... భార్య మీద తమకంతో కన్ను మిన్ను గానక పైనుండి వేలాడుతున్న పామును తాడనుకుని పట్టుకుని పైకి వచ్చేశాడు అని అర్థం అయ్యింది. నిశ్చేష్టతు రాలై... చాలా అసహ్యంతో... స్వామి, నేను రక్త మాంసల దిబ్బ... మల మూత్రాల మలినపు కొంపకు... రత్నావళి రూపం ఇచ్చాడు దేవుడు... అలాంటి నన్ను చూడలన్న కోరికతో ఇంత సాహసం చేశారే... మరి ఇట్టి కోరికతో ఆ సర్వేశుని చూడాలని అనుకుని



ప్రయత్నించి వుంటే... ఈ పాటికి మీరు దైవానుగ్రహం ఎప్పుడో పొందే వాళ్ళు కదా! అంతే ఆ మాటతో అతనికి జ్ఞానోదయం అయింది. పరమ పవిత్ర మనస్కుడై ఆ క్షణంలో సర్వ సంగ పరిత్యాగియై వెళ్లి పోయాడు... అతనే! తులసీదాస్!!

అంతే కాదు, వేమా రెడ్డి... కాస్తా యోగి వేమనగా మారిన వైనం. కామాన్ని జయిస్తే లోకానికి ఎంత హితం చేయవచ్చు అన్నది వేమన జీవితం ద్వారా తెలుస్తుంది.

కామం చేత కేవలం మనుషులే కాదు... మహాఋషులు సైతం

కన్నులు మూసుకుని చేసిన పనులు ఎన్ని అనర్థాలకు దారి తీశాయి అన్నది జగద్విదితమే కదా.

పరస్త్రీ వ్యామోహంతో నాశనం అయిన రావణుడి విషయం మనము రామాయణంలో చదివాము కదా. 64 విద్యలలో రాణించిన బ్రాహ్మణుడైనా సరే రావణ బ్రహ్మ కాస్తా కామము చేత రావాణాసురుడు అయిపోయాడు.

ప్రస్తుతం చుట్టూ ప్రపంచములో జరిగే ప్రతి దుష్కార్యం వెనకా కూడా ఉన్నది ఈ కామమే కదా? అన్నింటికీ కారణం కామమే. బాగు పడాలి అన్నా... చెడిపోవాలన్నా ఈ కామమే కారణం. మనము జ్ఞానాన్ని గ్రహించ లేకపోవడానికి మరియు ఈ జనన మరణ చక్రములో ఇరుక్కొని పోవడానికి కారణం కూడ ఈ కామమే. అందుకే ఏది మంచి ఏది చెడు అన్నది గుర్తెరిగి ప్రవర్తించాలి. అప్పుడే జీవితం సార్థకం అవుతుంది.

భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు, "అర్జునా! పొగచేత అగ్ని, మురికిచేత అద్దము, మావిచేత శిశువు యెట్లు కప్పబడునో, అట్లు కామము (కోరికల) చేత జ్ఞానము కప్పబడి యున్నది". కాబట్టి దీన్ని జయించడమే ఉత్తమం.

చచ్చిన తరవాత మోక్షము కావాలంటే బ్రతికి ఉన్నప్పుడు మోహా

క్షయం చేసుకోవాలి. మితి మీరిన కోరిక... మతుల గతులు తప్పించే కామము... ఎప్పుడైనా అనర్థదాయకమే. మన కోరికలు ఆశలు, ఆశయాలుగా మారినప్పుడే మన జీవితం అజరామరం అవుతుంది. అందుకే అంటాను...

**కోర్కె బ్రతికించు కొన్నాళ్ళు కొన్నేళ్ళు ।**
**ఆశ బ్రతికించు నీవుండు దాకా ॥**
**ఆశయమొక్కటేరా అమరత్వ మిచ్చేది ।**
**వినుర బాలచంద్ర వినయ సాంద్రా ॥**

కోరికలను జయించడం కష్టమే... అదుపు చేసుకోవడం మాత్రమే కాస్తా సులువు. మనసును మచ్చిక చేసుకుని మంచి మార్గములో మళ్లించడమే చేయాలి. అందుకు నిత్యము ప్రయత్నం చేయాలి. మన పతనానికి కారణం అయ్యే ఈ కామాన్ని జాగ్రత్తగా నియంత్రించాలి. ఇది జీవిత కాలపు క్రతువు.

ప్రేమతో...

**బాలచంద్ర**

7 నవంబరు 2023
గంగా తీరం, ఋషికేశ్.

# 2. క్రోధము... విరోధము!

**కోపతాపములు రెండును పాపము నిచ్చును**
**కోపము చేసుకున్న, వాడికదియే శాపమవును**
**క్రోధము మనలోనే వుండి విరోధము చేయును**
**క్రోధమణచిన లోకమంత మనదే, సత్యముగను**

మానవ జీవిత పురోగతికి అడ్డు గోడలైన అరి షడ్వర్గములలో అత్యంత ప్రమాదకారి అయిన శత్రువు క్రోధమే అని చెప్పాలి. కారణం సామాన్యుడి నుండి అసామాన్యుడి దాకా ఉచ్ఛ నీఛములను భేదం లేకుండా మనిషిని శక్తి హీనులను చేయగల లోపలి శత్రువు ఇది.

మనుషిని క్షణాలలో మృగంలా చేసే అత్యంత కిరతాకమైన, క్రూరమైన లక్షణం క్రోధమే. క్రోధమున్న వాడికి బయట విరోధుల అవసరం లేదు... తనలోని క్రోధము విరోధిగా మారి తనను సర్వ నాశనం చేస్తుంది.

చుట్టూరా జరిగే ఎన్నో అనర్థాలకు మూల కారణం ఈ క్రోధమే! సామాన్య భాషలో దీన్నే కోపం అంటారు. ఈ కోపమే మనిషి స్వరూపాన్ని

మరిపించి అనర్థదాయకమైన పనులు చేయించి మనలను అసురులుగా మార్చేస్తుంది. చిన్నప్పుడు నేర్చుకున్న శతక పద్యం గుర్తుకు వస్తుంది...

**తన కోపమే తన శత్రువు ।**
**తన శాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌ ॥**
**తన సంతోషమె స్వర్గము ।**
**తన ధుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ ॥**

శ్రీ కృష్ణుడు జరాసంధుని దండ యాత్రలకు వీలుకాని విధంగా సముద్ర గర్భంలో ద్వారక నగరం నిర్మించాడు. అదేమిటి అలాగా అని అనుమానం వచ్చేది. అప్పుడు తెలుసుకున్నాను... తన అల్లుడైన కంసుని చంపిన శ్రీ కృష్ణుడిపైన పగ ప్రతీకారంతో జరాసంధుడు రగిలి పోయేవాడు. శ్రీ కృష్ణుడిని తలచుకుంటేనే చాలు కోపంతో కంపించి పోయేవాడు. ఆ కోపంలో సుమారు 17 పర్యాయాలు మధుర మీద దండెత్తి రావడం... తన సైన్యాన్ని కోల్పోయి తిరిగి రావడం జరిగింది. సైన్యంతో పాటుగా అతడు కోపము వలన తన ఆయుషును కూడా కోల్పోతూ వచ్చాడు. చివరికి కోపము వలన శక్తి హీనుడై అచేతనమయిన దేహాన్ని, 18వ పర్యాయం శ్రీకృష్ణుడి సమక్షంలో భీముడు రెండు ముక్కలుగా చేసాడు. ఇక్కడ జరాసంధుడు



మరణించింది భీముడి చేతిలో అని చెప్పడం కంటే, తనలోని కోపమే అతనిని చంపింది అని చెప్పడం సరి అయిన కారణం అని తెలుసుకున్నాను.

కోపం కేవలం మహా వీరులనే కాదు... తాపసులను సైతం అధోగతికి విసరివేసింది. మహర్షులను కూడా ఆట పట్టించింది. కోపము వలన తమ తపః శక్తిని అంతా కోల్పోయిన వారి కథలు కూడా ఎన్నో పురాణాలలో వున్నాయి.

## కోపాన్ని నియంత్రించడం ఎలా?

ఇంతటి వినాశకారిని సామాన్యులమైన మనం ఎలా ఎదుర్కో గలము? కోపాన్ని నియంత్రించ గలిగితే ఇక ఏదైనా సాధ్యమే అవుతుంది. చాలా సందర్భాల్లో... ఎంతో మంది చెప్పగా నేను విన్నాను.

- కోపం మనిషిని పశువులా మారుస్తుంది. విచక్షణ లేకుండా చేస్తుంది.
- కోపం వచ్చిన ప్రదేశము నుండి, వ్యక్తుల దగ్గర వుండకుండా పక్కకు వెళ్ళాలి.
- ఒక గ్లాసులో నీళ్ళు తీసుకుని త్రాగాలి.
- ఒకటి నుండి వంద లెక్క పెట్టాలి.
- కోపములో అసలు మాట్లాడ వద్దు.
- కోపము వచ్చినప్పుడు నేను మనిషా లేక దున్నపోతా అని పది

సార్లు అనుకోవాలి.

- కోపము పరులు చేసిన తప్పులకు తన మీద తాను వేసుకునే శిక్ష అని తలవాలి.
- కోపము చేసుకున్న ప్రతి సారి మన ఆయుషు 20 నిముషాలు క్షీణిస్తున్నది అని తలవాలి.
- కోపములో ఉన్నప్పుడు మన రూపాన్ని ఒక్క సారి అద్దములో చూసుకుందాం!

ఇలాంటి సూచనలు అన్ని కూడా మన మీద చాలా దయతో చెప్పినవే. కానీ వాటిని మనం పాటించ గలిగె సామర్థ్యం వుండటం లేదు. ఆ కోపం వచ్చిన క్షణములో మనలను మనం మరచి పోతున్నాం. అందువలననే క్షణికావేశంలో జరగరానివి జరిగి పోతున్నాయి.

వేల సంవత్సరాల క్రిందటే, శ్రీ కృష్ణుడు గీతలో చెప్పాడు.

**క్రోధాద్భవతి సమ్మోహః ।**
**సమ్మోహాత్ స్మృతివిభ్రమః ॥**
**స్మృతిభ్రంశాద్బుద్ధినాశో ।**
**బుద్ధినాశాత్ ప్రణశ్యతి ॥**

దీని అర్థం ఏమిటి అంటే, కోపం వలన అవివేకం, అవివేకం వల్ల మతి చెడుతుంది, దాని వలన బుద్ధి పాడవుతుంది, ఆ బుద్ధి చెడగానే మనిషే నశించిపోతాడు.

## ఆచరణయే నిజమైన జ్ఞానం:

కన్నది, విన్నది, తెలిసింది, చదివింది అంతా జ్ఞానం కాదు! ఆచరణం మాత్రమే నిజమైన జ్ఞానం. అన్ని తెలిసిన వేదాంతులు కూడా ఈ కోపముతో వాచా వేదాంతులుగా మారిపోతున్నారు. కొండంత జ్ఞానము తలలో వున్నా సరే ఇసుమంత ఆచరణ చేతలలో వుంటేనే మనిషి, మనీషిగా మారతాడు. లేదంటే మనిషి మహిషిగా మారి పోతాడు!

## అమ్మ కోపం క్రోధమా?

మన నడవడికను చక్కదిద్దడంలో మొట్టమొదటి పాత్ర అమ్మది. కానీ, పెద్దలు చూపించే కోపములో ఎదుటి వారు బాగు పడాలనే లక్ష్యం కనిపిస్తుంది. బయట కోపమే, కానీ లోన ఎంతో అవ్యాజమైన దయ ఉంటుంది.

ఉదాహరణకు, చిన్నారి బిడ్డ అల్లరి ఆపడం కోసమై చాలా కోపంగా

చూస్తూ పిల్లాడిని భయపెట్టి కట్టడి చేస్తుంది అమ్మ. అవసరం అయితే ఒకటి తగిలిస్తుంది కూడా. పిల్లాడు ఏడుపు లంఘించుకుంటాడు. అయినా ఇదంతా పిల్లాడికి అమ్మ మీద కోపం కాదు. ఆ ప్రవర్తన అమ్మ కోపానికి పర్యవసానమూ కాదు, ప్రేమనే. ఇట్టి కోపము... మనము మాట్లాడుకునే క్రోధం కాదు.

## ధర్మాగ్రహం క్రోధమా?

అతిథి మర్యాదలు అందుకున్న విశ్వామిత్రుడికి దశరథుడు మాట ఇస్తాడు. ఆజ్ఞ ఇవ్వండి మీకు ఏమి కావాలో అది చేయడానికి మేము సిద్ధంగా ఉన్నామని. రామలక్ష్మణులను తనతో పాటుగా అడవికి యాగ సంరక్షణకు పంపమని ఆయన అడుగుతాడు. చిన్నారి పిల్లలను అడవికి పంపడమా అని పుత్ర వాత్సల్యముతో కన్నీరు కారుస్తున్న దశరథుని చూసి... కోపంతో ఊగిపోయాడు మునీశ్వరుడు. లోక కళ్యాణ కార్యం వలన, ఆయన అలా నటించాడు. అందువలన దశరథ మహారాజు భయపడి రామలక్ష్మణులను ఆయనతో పంపడం... ఆ తరువాత జరిగిన రాక్షస సంహారం, సీతా కళ్యాణం అన్ని మనకు తెలుసు. ఇది ధర్మాగ్రహం.

చాలా సందర్భాలలో... చుట్టూతా వుండే మనుషుల ప్రవర్తన,

క్రమ శిక్షణా రాహిత్యం, అలసత్వం, నిరాదరణ చూసినప్పుడు చాలా ఆవేదనతో కూడిన కోపం వస్తుంది... పరుషముగా మాట్లాడవలసి వస్తుంది. లోన ఎదుటి వాడు బాగు పడాలన్న తపన... మృదువైన ప్రేమ... బయట మాత్రము ముఖంలో రౌద్రం... నోటిలో భయ పెట్టే మాటలు వుంటాయి. చాలా సార్లు నన్ను అపార్థం చేసుకుని దూరం అయ్యే వాళ్ళు ఎక్కువ వుంటారు. అర్థం చేసుకుని జీవితాంతం నాతోనే వుండిపోయే వాళ్ళు చాలా తక్కువ. అయినా సరే ఇట్టి ప్రవర్తన వలన మన వాళ్ళు పరాయి వాళ్ళు అవుతున్నప్పుడు ఇంకెందుకు అనిపిస్తుంది. ఇది చాలా సంకటమైన స్థితి నాకు. ప్రేమతో చెబితే వినడం లేదు, కోపం చూపిస్తే నైనా మారతారేమోనని చిన్న ఆశ.

ఎవరో చెప్పినట్టు గుర్తు... అయ్యా మీరు మృదువుగా చెప్పినా మారతారని లేదు... పరుషంగా మాట్లాడినా మారతారని లేదు... అలాంటప్పుడు అనవసరంగా జనాలను ఎందుకు దూరం చేసుకుంటున్నారు అని. ఇది నిజమే అనిపిస్తుంది.

## క్రోధమునకు కారణం ఏమిటి?

ప్రస్తుత కాలంలో మనము కోప ప్రకోపాలను చూస్తుంటాము... లేదా అనుభవిస్తున్నాము. ప్రతి సందర్భంలో కూడా కోపం దేని గురించి

అన్నది ఆలోచించాలి. ఒక వేళ కోపం ఎదుటి వారి చర్యల వలన మనకు కలిగితే, అందుకు కారణం మంచిది అవుతే అందులో ఇక దోషం ఉండదు. అదే కోపం వెనక కారణం తప్పైతే మాత్రం ఇక ఆ కారణంగా మనము కోపం తెచ్చుకోకండా ఒకటి ఎదుటి వారి ముందు నుండి వెళ్లి పోవడం... రెండు మనము శాంతాన్ని కోల్పోకుండా అవతలి వ్యక్తికి స్వాంతన కలిగించడం, ఏదో ఒకటి చేయాలి. కోపంతో మనం పరుషంగా మాట్లాడి వారికి బాధను కలిగిస్తే మరింత మూర్ఖంగా ప్రవర్తించే ప్రమాదం లేకపోలేదు.

## కోపము అనారోగ్య హేతువు:

నిజానికి అరిషడ్వర్గములలో మనిషికి అనారోగ్యం కలిగించేది క్రోధం మాత్రమే... మిగతా శత్రువులు మనిషిని బయట ఇబ్బందులు పెడితే... ఒక్క క్రోధం మాత్రం మనిషి జీవితాన్ని బయటా మరియు లోపలా కూడా ఛిద్రం చేస్తుంది. కోపం భరించలేని స్థాయిలో ఉంటే అది రుగ్మతగా మారి తీవ్ర అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. మనము తరచూ వింటున్న గుండె పోటు, రక్త పోటు, పక్షవాతం, మెదడు చిట్లడం మొదలగునవి అన్ని కూడా క్రోధంతో ముడి పడి మరణానికి దారి చూపే దగ్గర దారులే.

**కోపముతో వున్నప్పుడు ఏమి చేయాలి?**

కోపముతో వున్నప్పుడు మాట్లాడవద్దు

కోపముతో ఎప్పుడూ ఏ పని చేయవద్దు

కోపముకు కారణాలు కాగితంలో వ్రాద్దాము

కోపముగా వుంటే, చక్కటి సంగీతం విందాము

కోపము వుంటే మంచి పుస్తకం చదువుదాము

కోపముతో వున్నప్పుడు ధ్యానం చేద్దాము

కోపంగా వున్నప్పుడు చక్కటి కీర్తనం చేద్దాము.

కోపంతో ఉన్నప్పుడు కాస్త నడిస్తే ఆరోగ్యం బాగుంటుంది.

అంతే తప్ప, కోపానికి వశులమై, కోపాన్ని మాటలలో, చేతలలో చూపించడం మాత్రం వద్దు. అది ఎప్పుడైనా వినాశనానికి దారి చూపుతుంది.

ప్రేమతో...

**బాలచంద్ర**

8 నవంబరు 2023

గంగా తీరం, ఋషికేశ్.

# 3. లోభము... లాభమా?

**లోభమింతయు లేక బ్రతుకు వాడు**
**లాభమింతైన చూడక సేవించువాడు**
**దయచే హృదయము నింపినవాడు**
**ధరణి యందు సదా జీవించినట్లు కదా!**

లోకానికి లోభము లేకుండా... స్వలాభము చూడకుండా యుగ యుగాల నుండి వెలుగు పంచే రవి చంద్రులను మనం ముందుగా తలచుకోవాలి.

శేషప్ప కవి చెప్పిన పద్యం నాకు బాగా ఇష్టమైనది. మీ ముందు ఉంచుతున్నాను.

"తల్లి గర్భము నుండి ధనము తేడెవ్వడు వెళ్లిపోయేడు నాడు వెంటరాదు" అను పద్యం జీవిత పరమార్థాన్ని స్వార్థ చింతనను తొలగించుకోవాలని మనకు తెలియపరుస్తుంది.

మనలను కష్టాలలోకి, నష్టాలలోకి నెట్టి వేసే 6 శత్రువులలో లోభము చాలా తమాషాగా మనతో పనులు చేయిస్తుంది. లోభము అంటే కేవలం

వనరులతో ముడి పడింది కాదు. లోభము మనసుతో ముడి పడి బుద్ధిని సైతము ప్రలోభ పెట్టేసి మన చేత చాలా విచిత్రమైన పనులు చేయిస్తుంది. తన, పర భేదాన్ని కూడా మరిచిపోయేలా చేస్తుంది.

మనిషికి చాలినంతగా సమయం, ధనం, శక్తి మరియు సామర్థ్యం తదితర వనరులు వున్నా సరే, వాటిని ఖర్చు చేయాల్సి వస్తే మాత్రం వంద సార్లు ఆలోచించి చివరకు చేయాల్సిన ఖర్చులో ఒక పది శాతం ఖర్చు చేస్తాడు. అందులో కూడా తాను పెట్టిన ఖర్చుకు వంద శాతం ఫలితం ఆశిస్తాడు.

చివరకు లోభం మనిషిని మింగేస్తే... ఇక తర, తమ భేదమే లేకుండా విజ్ఞతను కోల్పోయి ప్రవర్తిస్తాడు మనిషి. "లోభములో ఎట్టి లాభము కూడా లేదు". ఇది మనిషిని ప్రలోభ పెట్టే అవలక్షణం.

లోకంలో లోభులకు లోటు లేదు. లోభి సంపాదనే ధ్యేయంగా జీవనం సాగిస్తాడు. సంపాదించిన సంపద అంతా తరిగిపోతుందేమో అని నిత్యం చింతిస్తూ వుంటాడు. లోభికి కీర్తి నశిస్తుంది. ధనమే పావనమని భావించేవారు ధర్మ భ్రష్టులవుతారని, లోభికి స్నేహితులు ఉండరని పంచ తంత్రం చెప్తుంది. లోభానికి మించిన చెడు గుణం లేదంటారు భర్తృహరి.

లోభం అంటూనే, నాకు గుర్తుకు వచ్చేది "మహాభారతం"లో

దుర్యోధనుడు. దాయాదుల పట్ల అసూయతో చిన్న నాటి నుండి ఎన్నో విధాలుగా వారిని కష్ట నిష్టూరములకు గురి చేశారు. తల్లి, తండ్రి, గురువులు మరియు పెద్దలు చెప్పిన మాటలు పెడ చెవిన పెట్టి మరీ తన దుష్కృత్యములు సాగించాడు. అన్ని కష్టములలో కూడా పాండవులు విజయ కేతనం ఎగుర వేస్తూ అంతకు అంతగా బలవంతులైనారు. మానవ ప్రయత్నంతో పాటుగా దైవ సాయం వారికి తోడైంది.

ఇక 12 ఏళ్ల వనవాసం, ఒక సంవత్సరం అజ్ఞాత వాసం ముగిసింది. తాము మాయా జూదంలో పణంగా పెట్టిన రాజ్యాన్ని తిరిగి కోరుకున్నారు. పాండవుల బలం ఎరిగిన వాడైనా సరే, తనను కబళించిన లోభం వలన కనీసం 5 ఊళ్లు కూడా ఇవ్వనని చెప్పేశాడు. అంతెందుకు సూది మొన మోపినంత భూమిని కూడా ఇవ్వనని తెగేసి రాయబారి ఆయిన శ్రీ కృష్ణుని ముఖం మీద చెప్పాడు.

ఆ లోభత్వమే, యావద్ కౌరవులను మట్టిలో కలిపేసింది. అంతా తనదే... లాభం లేనిది నాకు వద్దు అని లోభం చేత తన చావును కొని తెచ్చుకున్నాడు దుర్యోధనుడు.

ఇక ప్రస్తుత ప్రపంచములో, ఈ లోభము కాస్తా మనుషలందరిలోను ఎంతో కొంత ప్రమాణంలో దూరి పోయింది. అప్పుడు యుద్ధాలు జరిగాయి... ఇప్పుడు వాజ్యాలు జరుగుతున్నాయి. లోభికి

అన్నదమ్ములు, అక్క చెల్లెళ్ళు, భార్యా పిల్లలు ఇలా ఏవి కూడా కనబడవు. గడ్డి వాము దగ్గర కాపలా కాసే కుక్కలా మారిపోతున్నారు మనుషులు. పరులకు పెట్టేది అటుంచి తనకు తానుగా కూడా పెట్టుకోవడం మానేస్తున్నాడు.

## లోభము Vs పొదుపు!

చాలా మంది మనలో లోభము అంటే పొదుపు అనుకుంటూ తమను తాము మోసం చేసుకుంటూ వుంటారు. చాలినంత వున్నా సరే ఖర్చు పెట్టడానికి ఆలోచించి, గీచి గీచి ఖర్చు చేసే వాడు లోభి. చాలినంత వనరులు లేకున్నా... చేయాల్సిన ఖర్చును ఆచి తూచి జాగ్రత్తగా ఖర్చు చేసే వాడు పొదుపరి.

సుధాముడు మరియు నంద కుమారుడు ఇద్దరు ఒకే గురుకులంలో చదువుకునే వారు. ప్రతి రోజూ వారు చుట్టూరా వున్న వనములోకి వెళ్లి ఆశ్రమ నిర్వహణకు కావలసిన వంట చెరుకు మరియు కంద మూలాలు తెచ్చే వాళ్ళు. ఒక రోజు అలా వెళ్ళే సమయంలో గురు పత్ని సుధామను పిలచి కొన్ని అటుకులు మూట కట్టి ఇచ్చి, నాయనా! ఇది పెట్టుకుని ఆకలి అయినప్పుడు తినండి అని చెప్పారు. కానీ ఆ ఆహారాన్ని తానొక్కడే ఆరగించాలని లోభత్వముతో స్నేహితుడు

అలసిపోయి తన తొడ మీద తల పెట్టుకుని నిద్రపోయే సమయంలో... మూడు పిడికిళ్ళు నోట్లో వేసుకుని తినేశాడు. నిద్రపోయే స్నేహితుడు అలికిడికి నిద్రా భంగమై రేయ్ ఎంట్రా తింటున్నావు అని అడిగితే... అబ్బే ఏమీ లేదు కృష్ణా అన్నాడు. ఇక అంతే తరవాత కాలంలో నిజంగానే ఏమి లేని గర్భ దరిద్రుడిగా మారిపోయి నానా అగచాట్లు పడ్డాడు. ఆ తరవాత కథ తెలుసు కదా? అదే మూడు పిడికిళ్ల అటుకులు తాను ఆరగించి వాడికి అష్ట ఐశ్వర్యాలు ప్రసాదించాడు. ఇది కృష్ణ కుచేల వృత్తాంతం. లోభికి పట్టే గతి ఏంటన్నది చెప్పే ఇతిహాసం.


వంద కోట్ల రూపాయల ఆస్తులు వున్న దైవ భక్తుడు, అయ్యా ఊర్లో రాముని గుడి కడుతున్నాం... మంచి విరాళం ఇవ్వండి అని వచ్చిన వాడికి 10 రూపాయలు ఇవ్వడం లోభం అని చెప్పాలి.

అదే పొదుపరి దగ్గరికి వస్తే, అయ్యా చాలా సంతోషం... నేను అంత వున్న వాడిని కాను. కానీ రాముడికి గుడి అంటున్నారు. ఇదిగో నేను వారం వారం దేవుడి దగ్గర పెట్టే ముడుపుల మూట. గత సంవత్సరం తిరుపతి హుండీలో వేసాను. ఈ సారి మీకు ఇస్తున్నాను అంటూ హుండీలో పోగు చేసిన సుమారు 500 ఇచ్చేస్తాడు.

**ఎవరు లోభి? ఎవరు పొదుపరి? చెప్పండి..**

అందుకే కాబోలు గురజాడ అప్పారావు గారు చెప్పింది... సొంత లాభం కొంత మాని గట్టి మేల్ తల పెట్టవోయ్!

నన్ను బాగా ప్రభావితం చేసిన సంఘటన చెప్తున్నాను... చాలా ఏళ్ళ క్రితం శ్రీ సత్య సాయి బాబా వారు వేసవి కాలంలో తమ విద్యార్థులతో కొడైకెనాల్‌లోని సాయి శృతిలో వున్న సమయంలో జరిగిన విషయం. ఆ రోజు స్వామి భక్తులు, ఉదయం వివిధ రకాల పూలు మరియు మామిడి తోరణాలతో స్వామి వారి నివాస ద్వారాలకు అలంకరిస్తున్నారు.



ఆ సమయంలో స్వామి వారు చూసి ఎందుకు వున్నవి బానే ఉన్నాయి కదా... మార్చడం అవసరం లేదు అన్నారు. భక్తులు స్వామి రోజు ప్రశాంతి నిలయంలో చేస్తున్నదే స్వామి అన్నారు.

అప్పుడు స్వామి, బంగారు అనంతపురంలో వేడి వాతావరణం వలన పూలు తోరణాలు ప్రతి రోజూ మార్చాల్సి వస్తుంది. ఇక్కడ చల్లని వాతావరణం కదా... మార్చే అవసరం లేదు. ఎందుకు మార్చడం వంద రూపాయలు దండగ అని చెప్పారు.

ఇది విన్న నాకు వింతగా అనిపించింది. స్వామి వారు మరీ ఇంతగా ఆలోచించాలా అని. ఇది లోభం కాక ఇంకేమిటి అనుకున్నాను.

అదే బాబా గారు... అదే సమయంలో ప్రశాంతి నిలయంలో వంద కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఉచిత ఆస్పత్రి కట్టిస్తున్నారు. అంటే తన కోసం ఖర్చు చేస్తున్నప్పుడు పొదుపు... పరుల క్షేమం



కోసం అవుతే ఎముక లేని చేయి.

నేను నేర్చుకున్నది ఇదే, నా కోసం ఖర్చు చేయాల్సి వస్తుంది అంటే గీచి గీచి ఖర్చు చేస్తాను లోభి లాగా... అది ఏ వనరులైన సరే. అదే సమాజం గురించి అయితే నా రక్తమయినా ధార పోస్తాను. నా పొదుపు డబ్బులను సేవలకు, చుట్టూరా అవసరంలో ఉన్నోళ్లకు, దైవ కార్యాలకు ఉపయోగిస్తున్నాను. చివరకు నాకున్న ఒకే ఒక ఇంటిని కూడా అభయ సంస్థ పేరు మీద వ్రాసేసాను.

ఇక నిత్య జీవితములో చాలా చాలా తక్కువ వనరులను వినియోగం చేస్తాను. అది సమయం కావచ్చు, ధనం కావచ్చు, వనరులు కావచ్చు ఏదైనా సరే, అవసరం వున్న దానికంటే కూడా తక్కువ ఖర్చు చేస్తాను. చల్ల నీళ్ళ స్నానం, పంచ ధోతి కట్టడం, అవి కూడా ఇస్త్రీ లేకుండా, కారు లేకపోతే బైకు లేక బస్సులో వెళ్ళడం, ఒకసారి తీసుకున్న చెప్పులను కనీసం 5 సంవత్సరాలు వాడటం, కట్టింగ్ మరియు షేవింగ్ సొంతంగా చేయడం, బయట తినక పోవడం... ఇవన్నీ కూడా నాకు నేను అలవరచుకున్న అలవాట్లు. ఇవన్నీ లోభము కాదు సుమా... సంస్థకు సమాజానికి ఎంతో లాభం.

## మరి లోభం పోగొట్టుకునేది ఎలా?

లోభానికి మూల కారణం నాది, నాది మాత్రమే అన్న మమకారం కదా. దీనిని గనక మనము సాధించ గలిగితే ఇక అంతా లాభమే. ఎలా ఓడించడం? కష్టమే కాదా... మనకు అంతా కూడా ఏదో రూపంలో లోభం పట్టి పీడిస్తూ వుంది కదా... ఎలా?

2018 అనుకుంటాను, శృంగేరి జగద్గురువులు శ్రీ విధు శేఖర భారతీ తీర్థ స్వామి వారు అనంతపురములో నిర్మాణంలో వున్న అభయ సంస్థకు విచ్చేసారు. అపుడు వారు చెప్పిన విషయం నిజంగా మంత్రమే.

అయ్యా! మనిషి జీవితంలో రెండు విషయాలు చాలా ప్రమాద కరం. అవి అహంకారము మరియు మమకారము. అహంకారాన్ని ప్రయత్నం చేత లేదా సాధన చేతా ఖండించుకొన వచ్చును. కానీ మమకారం అంత సులభం కాదు. దీనిని తగ్గించు కోవడం అసాధ్యం... అందుకే ఎంత పెంచుకో గలిగితే అంత పెంచుకోండి. నేను నాది అనే మమకారాన్ని ఈ సమాజమే నాది అన్న స్థాయికి పెంచండి. అప్పుడిక మీరు ఏమి చేసినా అది సమాజానికి హితం అవుతుంది. సమాజ హితమే మన హితమవుతుంది.

అరిషడ్వర్గాలలో... కాస్తో కూస్తో హానికరం కాని శత్రువు లోభమే అని చెప్పుకోవాలి. మిత్రులారా! కష్టమే అయినా సరే కాస్త సాధన

చేస్తే ఈ లోభాన్ని కాస్త లాభంగా చేసుకొనవచ్చు అనిపిస్తుంది. మిగతావి అన్ని కూడా చావే లేని వరాలు పొందిన బ్రహ్మ రాక్షసులు అని చెప్పాలి. ఎంతో కొంత నయమైనది లోభమే సుమా... కాబట్టి కనీసం ఈ లోభాన్ని అయినా సరే మచ్చిక చేసుకుని లాభ పడదాం.

ప్రేమతో...

9 నవంబరు 2023 **బాలచంద్ర**

తాడకేశ్వర్

# 4. మోహము... మోసమే!

**మోహమింతయి లేక మనుగడ ఎందుండు**
**మోహము మనల బంధించి భాదించుచుండు**
**మోహ నాశము మనిషికి సాధ్యమగునే నేడు?**
**మోహనుని మోహించుటలోనే మోక్షముండు**

మోహము, మనిషిని విషయాల మీదనో, వస్తువుల మీదనో, వ్యవహారాల మీదనో, వ్యక్తుల మీదనో మోహితుడిని చేసి వాడిని వివశున్ని చేస్తుంది. ఇక వెరేదేదియు మనిషికి కనబడదు. మోహముతో వున్న వాడు ఇక సర్వకాల సర్వావస్థల యందును... నిద్రాహరములు కూడా తలవక తదేక ధ్యానంతో వ్యక్తి, వస్తు, విషయాల మీద ఆసక్తి కలిగి ఉంటాడు.

తామరలో వున్న మకరందము మీద ఇష్టం (అనురక్తి) తో భ్రమరం పుష్పము మీద వాలి... తననూ తాను మరచి మోహముతో మకరందాన్ని గ్రోలుతుంది. చివరకు ఆ కమలం సూర్యాస్తమయ సమయములో ముడుచుకునే విషయం కూడా గమనించక అందులోనే

వుండి పోయి ప్రాణం విడుస్తుంది.

పట్టు పురుగును ఆకులతో చక్కగా మేపుతూ వుంటారు. ఆకులు తింటూ తనని తాను మరచి ఆహారం, వెచ్చదనం, సుఖం మీద మోహంతో మత్తుగా ఆ పురుగు దారం వదులుతూ వుంటుంది. ఎప్పుడయితే అది మోహం ఎక్కువై దారం విడవడం ఆపేస్తుందో... అప్పుడు ఆ పురుగును వేడి నీటిలో ఉడికిస్తూ దారాన్ని వేరు చేస్తారు... కనీసం ఆ పురుగు వేడికి చచ్చిపోతున్నాను అన్న ధ్యాసలో కూడా లేనంత మత్తు (మోహం)లో ఉంటుంది.

ఇప్పుడు మన జీవితములో తటస్థమయ్యే విషయాలను పరిశీలిద్దాం!

ధన సంపాదనలో మునిగి పోయి మరింకేదీ పట్టక జీవించే వాళ్లను చూస్తూనే వున్నాము కదా!

ఆధునిక సాంకేతికతకు బానిసలై పోయి ఆయా వస్తువుల వినియోగంలో తమను తాము మరచిన వాళ్ళున్నారు కదా!

సామాజిక మాధ్యమాల మోజులో పడి ఎన్ని లక్షల మంది తమ జీవితాలను పాడు చేసుకుంటున్నారో తెలుస్తోంది కదా!

చేతిలో మొబైల్ ఫోన్ మీద మోహంతో... మానసిక రుగ్మతలను సైతం ఆహ్వానించే వాళ్ళు కోకొల్లలు కదా!

పుత్ర వాత్సల్యంతో వారి ఎడబాటు తాళ లేక ప్రాణాలు సహితము

పోగొట్టుకునే వాళ్ళున్నారు కదా!

పరస్పర ఆకర్షణలో పడి జీవితాలను పెడ మార్గములో పెట్టే యువతీ యువకులను చూస్తూనే వున్నాం కదా! ఎంత మోహంలో ఉంటున్నారంటే ఆమోహంలో తమను కన్నవారిని కూడా పట్టించుకోలేనంత హీనస్థితి.

చిన్న పిల్లలు ఎంతో మంది వస్తువుల మీద మక్కువ పెంచుకుని అవి కావాలని హఠం చేస్తుంటారు కదా!

తల్లిదండ్రులు కూడా తమ పిల్లల మీద వ్యామోహంతో వారు అడిగినవన్నీ ఇవ్వడానికే సిద్ధపడుతున్నారు తప్ప వద్దని వాదించలేక పోతున్నారు.

తిండి మీద వ్యామోహంతో ఆరోగ్యాన్ని పాడు చేసుకుని... చివరకు అచేతనులయ్యే వారిని గమనిస్తున్నాం కదా!

ఇవన్నీ కూడా మోహమునకు ఉదాహరణలుగా చెప్పొచ్చు. చేసే పని తప్పని తెలిసినా... అందులో నుండి బయట పడలేక పోతుంటారు. జీవిత కాలం ఆ వ్యామోహంలో మురిగి పోతుంది. నిజం తెలుసుకుని మనలను మనం చక్క దిద్దుకునే లోపుగా పుణ్య కాలం కాస్తా ముగిసిపోతుంది.

అన్నీ విడచి విరాగిగా మారి... అందరకీ దూరంగా అడవిలో

ముక్కు మూసుకుని తపమాచరించే వాడు జడ భరతుడు. చిన్న కుటీరంలో వుంటు తన సాధన చేసుకునే వాడు. ఒకానొక రోజు ఆశ్రమానికి అప్పుడే కన్న చిన్న పిల్లని విడచి కన్ను మూసిన జింకను చూసాడు. తల్లిని కోల్పోయిన ఆ చిన్న జింక పిల్లను చూసి హృదయం కరిగి పోయింది. దాని అలనా పాలనా చూసుకుంటూ కాలం గడిపేవాడు. చివరకు ఆ జింకను వదల లేనంత మొహం పెంచుకున్నాడు. తన సాధన అంతా కూడా గాలిలో కలిసి పోయింది. అవసాన దశలో కూడా ఆ జింక గురించి ఆలోచిస్తూ కన్ను ముసాడు. తరవాత అతను కూడా జింక లాగా జన్మించాడు. మోహం ఎంత మోసము చేస్తుందో గమనించారా?

తనది కానిది, తనకు సంబంధం లేని వాటి మీద మోహం పెంచుకోవడం వలన అధోగతి తప్పదు. సీతాపహరణ విషయం గమనించండి. అన్ని వదిలి రాముడే సర్వస్వం అని తలచిన సీత అడవులలో కూడా ఎంతో ఆనందముగా రాముడితో జీవించింది. ఎప్పుడయితే బంగారు లేడి మీద మనసు పారేసుకుందో... ఇక అంతే రాముడికి దూరం అయిపోయింది. మోహమునకు ఇంత దారుణమైన పర్యవసానం ఉంటుంది. పరమ సాధ్వి అయిన ఆ సీతామాతను కూడా ఈ మోహము ఆవహించి తన భర్తకు దూరం చేసింది.

## మరీ మోహమును వదిలించు కోవడం ఎలా?

వస్తువులు, విషయాలు, వ్యక్తులు ఇవియే కదా మోహమునకు కారణం? వాటి యొక్క పరిమితులు తెలుసుకుందాం. అపరిమితమైన ఆనందం సృష్టింపబడిన వాటిలో లేదు... వాటిని సృష్టించిన శక్తిలో వుందని గమనిస్తే ఇక మోహము కాస్తా సమ్మోహనమై మనలను భగవత్ కృపకు పాత్రులను చేస్తుంది.

కానీ ఈ జ్ఞానం ఏది కూడా మనలను సమాధాన పరచవు. ఇప్పుడేమైంది... నా మనసుకు నచ్చిందే చేస్తున్నాను కదా... నా ఆనందం కోసం బ్రతుకుతున్నాను... ఇందులో తప్పేముంది! ఎవరేమనుకుంటే నాకేంటి... నాకు నచ్చినట్లు వుంటాను... నాకు ఇష్టం వచ్చినట్లు చేస్తాను... నన్ను అడ్డుకునేది ఎవ్వరు? ఇదిగో ఇలాంటి ప్రవర్తన వలననే కదా ప్రపంచంలో ఎన్నో వింతలు, వికృతాలు జరుగుతున్నాయి. మోహావేశములో మనిషి సహజమైన వ్యక్తిత్వాన్ని మరచి విశృంఖలతకు బీజం వేస్తున్నాడు. అందువలన ఎన్నో అకృత్యాలు దుష్కృత్యాలు జరిగి పోతున్నాయి. అంతెందుకు నేటి యువత పాశ్చాత్య సంస్కృతి వ్యామోహంలో పడి కన్ను మిన్ను గానక తప్పుల మీద తప్పులు చేస్తూ తమ జీవితాలను కోల్పోయే స్థితికి దిగజారుతున్నారు.

అల్లారు ముద్దుగా పెంచుకునే కొడుకు, వాడు అడింగిందల్లా చేసాడు తండ్రి. వాడికి వాహనాలు వేగంగా నడిపే మోజు... పెద్ద కారు అత్యంత వేగంగా నడుపుతూ అదుపు తప్పి ఆ ప్రమాదంలో చచ్చి పోయాడు. వస్తువుల మీద మోహం పెంచుకుంటే తెచ్చే తంటా ఇది.

తల్లితండ్రులు బిడ్డల మీద వ్యామోహంతో తరాలు తిన్నా తరగని ఆస్తి పోగేసి... వాళ్ళను పరాన్న జీవులుగా మార్చేసి వెళ్లి పోతారు. ఇక బిడ్డలు ఆయాచితంగా వచ్చిన ఆస్తిని సులభంగా పెంచాలని వక్ర మార్గాలలో ప్రవేశించి... వేలకు వేలు కోట్లకు కోట్లు తప్పుడు మార్గాలలో సంపాదిస్తూ... జీవితం అంటే ఆడంబరం... దర్పం... సుఖం... రాజసం... సంతోషం అంటూ గడిపేస్తారు. చివరకు ఇలాంటి వాళ్ళు ఏమవుతారు అన్నది మనం చూస్తూనే వున్నాం కదా. డబ్బు మీద వ్యామోహం ఇది.

అప్పుడెప్పుడో, శ్రీ రామకృష్ణ పరమహంసను పరీక్షించడానికి నరేంద్రుడు చేసిన పని గుర్తుకు వస్తుంది... వైరాగ్యము అంటూ... ఎల్లప్పుడూ దైవార్పిత భావనతో వుండే గురువు గారిని పరీక్ష చేయడం కోసమై, వారు లేని సమయం చూసి వారు కూర్చునే పరుపు దుప్పటి క్రింద కొన్ని నాణేలను ఉంచుతాడు నరేంద్రుడు. గురువు గారు పరుపు



మీదకు వస్తూనే... అయ్యో ఏమిటి నా ఒళ్ళు... మంటలు వస్తున్నాయి... ఏమైంది... ఏదైనా పురుగు వుందేమో చూడండి అంటూ అరవడం మొదలు పెట్టాడు. చుట్టూ వున్న భక్తులు అందరూ పరుపును, దుప్పటిని ఎత్తి విదిలించారు. అందులో నుండి పైసలు క్రింద పడ్డాయి. అప్పుడు

వాటిని చూపించి ఇవే వారి మంటలకు కారణం అని చెప్పిన గురువు గారి వైరాగ్యం చూసి నిశ్చేష్టుడయ్యాడు నరేంద్రుడు.

మిత్రులారా! తరచి చూస్తే, వస్తు విషయాల మీద మోహము ఎప్పుడైనా మోసమే అని తెలుస్తుంది. అందుకే మోహనున్ని మాత్రమే మోహిద్దాం... అది మాత్రమే శాశ్వత ఆనందానికి మార్గం అని గ్రహిద్దాం.

నేను నేర్చుకుంటున్నది కూడా ఇదే, దేని మీద మోహం పెంచుకోవద్దు. సాధ్యమైనంత వస్తువులను, విషయాలను, వ్యక్తులను కేవలం జీవించడానికి వాడుకోవాలి అంతే తప్ప వాటినే జీవితం చేసుకోవద్దు.

ప్రేమతో...

10 నవంబరు 2023 **బాలచంద్ర**

తాడకేశ్వర్

# 5. మదము... ప్రమాదము!

**మదము మనిషిని మందము చేయును తథ్యముగను...**
**మతమేదైనా నేమి మదము మతులు చెరచును సత్యముగను...**
**మానవత్వమును పశుత్వమునకు చేర్చును నిజముగను**
**భ్రాంతి వీడకున్న క్రాంతి ఎటులొచ్చు చెప్పరయ్య మీరే ఒప్పుకొందు**

ఇది నాకు మాత్రమే వుంది... ఇంకొకరికి లేదు. నేను అంత... ఇంత... ఎంతో అనుకుంటూ... కన్నూ మిన్నూ కానక... తన స్థాయిని మరచి పక్క వాళ్ళను పిపీలకములుగా చూస్తూ వుంటారు... ఇదిగో దీనినే మదము అంటారు.

రాజు గారి పట్టపుటేనుగు... మావటి వాళ్ళు చక్కని మేత వేసి.. ఎంచక్కగా దానికి శిక్షణ ఇస్తారు. రాజ వీధిలో రోజూ దానిని ఠీవిగా కొంత సేపు నడిపిస్తారు కూడా... అలాంటి ఏనుగుకు ఒక్కోసారి మదమెక్కి ప్రవర్తిస్తే ఏమవుతుంది... అయ్యో రాజుగారి ఏనుగు అని వెళ్లి దండం పెడతారా ఎవరైనా... లేదు... బ్రతుకు జీవుడా అని

పారి పోయి ప్రాణాలు దక్కించుకుంటారా? మదము ఎక్కిన ఏనుగుకు రాజు లేదు బంటూ లేదు... ఎదురు వచ్చిన వాడిని తొక్కడమే! చివరికి అంకుశం పోటుకు గానీ దానికి మదము దిగదు.

మనుషులని చెప్పుకునే మనలను పట్టి పీడించే లోపలి శత్రువులలో ఈ మదము కూడా ఒక్కటి. పురాకృత జన్మ విశేషము వలన, కఠోరమైన శ్రమ వలన, అకుంఠిత దీక్ష వలన, పుట్టుకతో అబ్బిన ప్రవృత్తి వలన వచ్చిన విశేష ప్రతిభను భగవద్ అనుగ్రహంగా తీసుకొనక అదేదో తనకు మాత్రమే వున్నదనుకుని చుట్టూ వున్నోళ్ళను తక్కువ చేస్తూ... అవమానిస్తూ... ఛీత్కరిస్తూ ప్రవర్తిస్తే ఏమంటారు... వాడికి మదమెక్కి అలా అయ్యాడు అంటారు అవునా?

మిత్రులారా! చరిత్రలో మదమెక్కి ప్రవర్తించిన వాడెవడు కూడా బాగు పడిన దాఖలాలు లేవు. తరచి చూస్తే మనిషిని పట్టి పీడించే మదములు 8 రకాలుగా వుంటాయి. ఇది ఎక్కడో శాస్త్రంలో చెప్పిందిలే... అందులో ఏముంది అంటారేమో ఒకసారి పరిశీలించండి... మనం అందరం ఇందులో ఏదో ఒక మదము ప్రభావంలో ఏదో ఒక తప్పుడు పని చేసే వుంటాము.

1. అన్న మదం
2. అర్థ మదం
3. స్త్రీ మదము
4. విద్యా మదము
5. కుల మదము
6. సౌందర్య మదము
7. అధికార మదం
8. యవ్వన మదము

నేను అన్నం పెట్టే వాడిని... నాకు క్షయమే లేదని విర్రవీగే వాళ్ళను చూసి ఉంటాము కదా. వాళ్ళు గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటి? నాకైనా వాళ్ళకైనా అన్నం అందించేది పరమాత్ముడే అన్న విషయం. అప్పుడు... అన్నము పెట్టినోడు పరుల కంటికి పరమాత్మలా అగుపిస్తాడు.

స్వామి సమర్థ! హిందూ సామ్రాజ్య చక్రవర్తి శివాజీ మహారాజు గురువర్యులు. వారిని చూసేందుకు ఆశ్రమానికి వచ్చిన శివాజీని ప్రేమతో పలుకరిస్తూ... నాయనా ఎలా వున్నావు... రాజ్యం ప్రజలు అందరూ క్షేమమేనా అని అడిగారు. శివాజీ మహారాజు చాలా



స్వాతిశయంతో... స్వామి శివాజీ పాలనలో అంతా క్షేమంగా... అన్న పానీయాలకు లోటే లేకుండా వున్నారు అని చెప్పాడు. అతని మాటల లోని స్వాతిశయాన్ని గమనించిన సమర్థ రామదాసు... నాయనా ఇదిగో ఆ బండ రాయిని పగుల గొట్టు అన్నారు. ఇదేమిటి సంబంధం లేని మాట అనుకున్న శివాజీ అక్కడే వున్న పెద్ద సుత్తితో ఆ బండను పగులగొట్టే ప్రయత్నం చేస్తుంటే... ఆ బండ పగుళ్ళ లోనుండి... ఒక చిన్న కప్ప టక్కుమని గెంతుతూ బయట పడింది. చాలా ఆశ్చర్యంగా ఆ పగుళ్ళలోని నీటిలో జీవించి వుంది. స్వామి సమర్థ చెప్పాడు... ఏమి నాయనా! శివాజీ మహారాజు ఈ కప్పకు కూడా

అన్న పానీయాలు అందిస్తున్నరా? శివాజీకి అర్థం అయింది... తానెంత తప్పు మాట్లాడాడో! వారి పాదాలకు నమస్కరించాడు... స్వామి అందరికీ అన్న పానీయాలు అనుగ్రహించేది భగవంతుడు. ఆయన నియమించిన భృత్యుడు నేను అని చెప్పాడు.

మిత్రులారా! సంపద, స్త్రీలు, విద్య, కులము, యవ్వనము, అధికారము వలన కలిగే గర్వము, దర్పము, మదము ఇవన్నీ కూడా మనిషిని నిలువెల్లా దహించి కూలదోస్తాయి అన్న దాంట్లో ఎట్టి సందేహం లేదు. పైన చెప్పుకున్న శక్తి సామర్థ్యాలు అన్నీ కూడా మన సదాలోచన, సత్ ప్రవర్తనతో భాసిస్తాయి.

అన్ని ఇచ్చేది భగవంతుడే సుమా! మనము కేవలం ఆ దైవానుగ్రహమునకు చౌకీ దారులు మాత్రమే అన్న భావనతో... చుట్టూ వున్నోళ్ళకు మంచి చేస్తే మనము చరిత్రను సృష్టిస్తాము...

మదమెక్కి ప్రవర్తించే వాళ్ళను రాక్షసులతో పోలుస్తారు కదూ... ఎందుకు అంటారో తెలుసా... ఒక సారి పురాణాలలోకి తొంగి చూస్తే ఇట్టే అర్థం అవుతుంది.

బాహువులే లేకుండా జన్మించిన వాడు అర్జునుడు. దత్తాత్రేయ వర ప్రసాదముతో సహస్రబాహు బలసంపన్నుడై... స్వర్గాన్ని సైతము

తన అదుపాగ్నలో పెట్టుకున్నాడు. కార్తవీర్యార్జునుడు అని పిలువ బడ్డాడు. వేటకు వెళ్లి అలసిన వారికి వారి అనుయాయులకు జమదగ్ని మహర్షి క్షణాలలో రాజ భోగమును ఏర్పాటు చేస్తారు. ఇదేమి వింత... అరణ్యంలో నివసించే మహర్షికి ఇదెలా సాధ్యం అని అడిగాడు. కామధేనువు బిడ్డ నందిని ఈ ఆశ్రమంలో వర్ధిల్లుతోంది... దాని చలువయే ఇదంతా అని చెప్పారు. ఇంత అద్భుతమైన ధేనువు అరణ్యంలో కాదు అంతఃపురంలో ఉండాలని... అధికార మదముతో మునివర్యులు వద్దన్నా వినకుండా తీసుకుని వెళ్లి పోయాడు. జమదగ్ని కుమారుడైన పరుశురాముడు ప్రళయ కాల రుద్రుడై వాడిని హతమార్చి... అంతటితో ఆగక భూమండలంలో మదమాత్సర్యములతో ప్రజా కంఠకులైన క్షత్రియులని 21 మార్లు భూమండలాన్ని చుట్టి వధించాడు. తన మదముతో మందమతిగా మారి క్షత్రియ లోకమునకు మాయని మచ్చగా నిలిచాడు కార్తవీర్యార్జునుడు.

ప్రస్తుత కాలంలో, అధికార మదముతో ప్రవర్తిస్తూ ప్రజలను, ప్రజా ధనాన్ని, ప్రకృతి వనరులను దోచుకునే వాళ్ళు కోకొల్లలుగా చూస్తూనే ఉన్నాము. వారికి మళ్ళీ జన్మలో కాదు... ఈ జన్మలోనే తగిన శాస్తి తప్పక జరుగుతుంది. ఇలాంటి విషయాలు కూడా మనం

గమనిస్తున్నాం కదా!

ఇక చాలా మంది విద్యావేత్తలు, పండితులు, ప్రవచన కర్తలు, అధికారులు... విద్యా మదముతోటి ఎట్టి ప్రవర్తనలో ఉంటున్నారు అన్నది మనము చూస్తున్నాము కదా. అష్ట మదములలో ఏ ఒక్కటైనా చాలు మనలను పడగొట్టి సమాధి చేయడానికి. ఇది గుర్తిస్తే, బాగు పడతాం.

విరగ కాసిన పండ్లతో... చెట్టు సహితం వంగి నిలుస్తుంది.

మంచి కంఠము ఇచ్చినందుకు... కోయిల పాట పాడి రంజింప చేస్తుంది

అధికారం వచ్చిన భరతుడు... అన్న పాదుకలను పట్టాభిషేకం చేసి భృత్యుడిలా పాలించాడు.

విద్యావంతుడు... సదా వినయముతోటి జీవిస్తాడు.

మతము కులము కంటే మానవత్వముతో జీవించే వాళ్ళు ధన్యులు

శక్తి యుక్తులు ఉన్న వాడు... లోక హితం చేసే ప్రయత్నం చేస్తాడు.

ఇతరులకు లేని శక్తి సామర్థ్యం మనలో వుందంటే, దాని అర్థం లేని వారికి ఆ శక్తి సామర్థ్యాలను ఉపయోగ పెట్టమని అర్థం. అంతే తప్ప మదమెక్కి కన్నూ మిన్నూ గానక ప్రవర్తించేందుకు కాదు అన్నది

గమనిస్తే మన జీవితానికి సార్ధకత చేకూరుతుంది.

అందరి కంటే మనలో ఎక్కువగా వుండే సామర్థ్యం ఏదైనా సరే... మంచి కోసం వెచ్చిస్తే చరిత్రలో మిగులుతాము... లేదంటే చరిత్రలో కలిసి పోతాము. చరిత్ర సృష్టించేలా బ్రతికే అవకాశం ఈ రోజుల్లో ప్రతి ఒక్కరి సొంతం. అందుకు కావలసిన శక్తి సామర్థ్యాలు ఏదో ఒకటి పుష్కలంగా దేవుడు ఇచ్చాడు. వాటిని అందరి మంచికై వినియోగిద్దాం. మదము ఎప్పుడైనా ప్రమాదం అని తెలుసుకుందాం.

ప్రేమతో...

11 నవంబరు 2023 **బాలచంద్ర**

ఋషికేశ్.

# 6. మత్సరము... మరణమే!

**మానవత్వము లేని మతితో తోటివారిని చెరచు**
**అకారణమున పరుల బ్రతుకులు పాడుచేయు**
**తనకున్నది వేరేవరికి వలదని విలపించు తరచు**
**తనకు లేనిది ఎవరికీ దక్కవద్దనుటే మత్సరము**

తనకు వున్న శక్తి సామర్థ్యాలు లోకములో ఇంకెవరికి లేవన్న దర్పము మదము అవుతే... ఇక తనకున్న సంపదలు ఇతరులకు ఉండకూడదని, తనకు దక్కనిది ఇతరులకు దక్కకూడదని, ఒకవేళ తను పొందలేని పరిస్థితిలో ఆ వస్తువు ఇతరులకు దక్కకుండా నాశనం చేసే ఈర్ష్య కలిగి ఉండటమే మాత్సర్యము.

మద మాత్సరములు రెండు కూడా చాలా మటుకు కలిసే వుంటాయి. ఇవి మనిషిని క్రూర మృగములా కాదు... క్రూర రాక్షసుడిలా మార్చేస్తాయి. ఇంతకు మునుపు ఇలాంటి వాళ్ళు చాలా అరదుగా కనిపించే వాళ్ళు. అలాంటి వాళ్ళు లోక కంఠకులుగా పిలవబడే వాళ్ళు. అవతార మూర్తులు, కారణ జన్మలు, అంశావతారులు... అట్టి వాళ్ళను సులభంగా ఏరి వేసే వాళ్ళు...

తద్వారా లోకము సుఖ శాంతులతో వర్ధిల్లింది.

కానీ ప్రస్తుత కలికాలంలో మద మాత్సర్యాలు లేని మనిషి అసలు కనిపించడమే లేదు. కారణం... రోజు రోజుకు మృగ్యమవుతున్న విలువలు, మంచి చెప్పినా వినని మంద బుద్ధులు చుట్టూతా ఎంతో మంది కనిపిస్తారు. మనము ప్రతి రోజు ఎన్నో విషయాలు వింటున్నాము... కంటున్నాము కదా... కక్షలు కార్పణ్యాలకు పోయి, ఒకరినొకరు చంపుకునే స్థాయిలో ఉంటున్నారు సామాన్యులు కూడా.

ప్రేమించిన అమ్మాయి తనను కాదన్నది అని, అబ్బాయి కక్ష పెంచుకుని అమ్మాయి మరెవరికీ దక్క కూడదని ఆమెను పొడిచి చంపే వాళ్ళను ఎంత మందిని చూడటం లేదు... ఇది మాత్సర్యము కాక మరేమిటి?

పరీక్షలలో తనకు సాయం చేయలేదన్న కక్షతో సహచర విద్యార్థి సమాధాన పత్రాలను చింపివేసి పైశాచిక ఆనందం పొందే వాడిది మాత్సర్యం కాదా?

ఎన్నికలలో తాను ఓడిపోవడం ఖాయం అని... తప్పని తెలిసినా ఎన్నికల పెట్టెలలో ఇంకు పోసి లేక నిప్పు పెట్టి పేట్రేగి పోయే రాజకీయ నాయకుల మనస్తత్వము మాత్సర్యము కాదా?

తన పొలములో పంట అనుకున్నంత రాలేదని పక్కోడి పొలంలో పంట విరగకాసిందన్న కసితో కడుపులో మంటతో పక్కోడి పంటను

మంటకు ఆహుతి చేసే వాళ్ళు కనిపిస్తున్నారు కదా?

అసలు మన నిత్య జీవితములో ఎన్నో సందర్భాలలో మనము కూడా ఈ మద మాత్సర్యాలకు లోనయి తడబాటుకు గురి అవుతున్నాం కదా?

అంతెందుకు, చిన్న పిల్లలు నలుగురు చేరి క్యారంబోర్డు ఆడుతున్నారు. అందులో ఒక్కడు బాగా ఆడలేక పోతున్నాడు. మిగితా పిల్లల ఆనందాన్ని చూసి తట్టుకోలేక పోతున్నాడు. అంతే ఆట మధ్యలో ఉండగనే, వాడు ఉక్రోషంతో ఆ పావులను మరియు బోర్డును ఎత్తి పడేసి వికటాట్టహాసం చేస్తాడు... చూడటం లేదా?

ఇలాంటి ప్రవర్తన కేవలం పసి పిల్లలలోనే కాదు సుమా పెద్దలైన మనలో కూడా అప్పుడప్పుడు కనిపిస్తుంటుంది. సరదాగా ఆటలతో మొదలై... వ్యాపకాలకు వ్యాపించి... జీవితములో దిద్దుబాటు చేసుకోలేని విధంగా మార్చేస్తాయి.

ఇదంతా కూడా మనలో ఉన్న దుర్లక్షణాల ఉనికిని మనకు తెలియజేసే సంఘటనలు. ఇలాంటి లక్షణాలు సరదాగా కూడా వుండోద్దు... అలాంటివి అలవాటుగా మారితే ఏమవుతుంది... మనకు తెలియకుండానే మనం రాక్షసులుగా మారిపోయి... జీవితాలను నాశనం చేసుకుంటాము.

రామాయణం ఎలా మొదలైంది తెలుసును కదా... కైకేయి

ఈర్ష్య అసూయల వలననే కదా. భారత యుద్ధమునకు కారణం ఏమిటి దుర్యోధనుని మాత్సర్యము కదా! అంతెందుకు పూర్వ పురాణాలైనా... ప్రస్తుత కాల పరిస్థితులయినా సరే, మనము గమనిస్తే జరిగే ప్రతి వికృత చేష్టకు కారణం ఈ మద మాత్సర్యాలే అన్నది అవగతం అవుతుంది.



మాత్సర్యము తొలగిపోవాలంటే:

1. ఎవరేమైతే నాకేమిటి, నేను మాత్రం సుఖంగా ఉండాలన్న భావన నుండి... అందరూ బాగుండాలి అందులో నేనుండాలి అన్న భావన అభివృద్ధి చేసుకోవాలి.

2. పక్క వాడి బాగును చూసి మనం సంతోష పడగలిగితే అదే మనిషి ఔన్నత్యాన్ని పెంచే మొదటి మెట్టు.

3. చుట్టూరా సమాజములో జరిగే ప్రతి అభివృద్ధిని చూసి ఓహో ఇదంతా దైవానుగ్రహం... ఇందులో నేను కూడా భాగస్వామిని కదా అన్న భావన ఆరోగ్యాన్ని ఇస్తుంది.

4. ఏదైనా దుర్భావన వచ్చిన వెంటనే, ఆత్మ విచారం చేసుకుంటూ... ఆత్మ విమర్శతో తనను తాను పవిత్రం చేసుకుంటూ... ఆ భావాలకు తిలోదకం ఇవ్వాలి.

5. ప్రతి నిత్యం మనం ఏ ప్రార్థన చేయక పోయినా ఫరవాలేదు... "సమస్త లోకాః సుఖినోభవంతు" అన్న భావనతో మాత్రమే బ్రతకాలి.

6. పక్క వాళ్ళ శ్రేష్ఠతను ప్రేరణగా తీసుకుని మన స్వీయ అభివృద్ధికి ప్రయత్నించడం సముచితమైన పని.

7. ఇతరుల బాగు చూసి మనపై మనము నమ్మకం కోల్పోవద్దు. బలహీనమైన మనసును లాగి కింద పడేయడం లోపలి శత్రువుకు సులభతరం. ఎల్లప్పుడూ దృఢ చిత్తులై మెలగాలి.

ఇట్టి భావనలు మనము కూర్చుకో గలిగితే ఇక అంతకంటే జీవిత పరమార్థం ఏముంటుంది. ఆ పరమార్థం తెలుసుకున్నప్పుడు ఇక అంతా చిర శాంతియే కదా..

మిత్రులారా! అరిషడ్వర్గములు అన్ని కూడా బ్రహ్మ భావంతో చరించినప్పుడు మచ్చిక చేసిన పులులలాగా స్తబ్దుగా పిల్లులలా మనలోనే ఉండిపోతాయి. ఎప్పుడు అయితే బ్రహ్మ భావన తొలిగి మానవ నైజంతో జీవించడం మొదలవుతుందో ఇక విషయ వాసనలు వాంఛలు అన్ని కూడా స్తబ్దుగా పడుకుని వున్న పులులకు ఆహారంగా మారి వాటిని బలంగా తయారు చేసి వాటి ద్వారా మన జీవితాన్ని సర్వ నాశనము చేసే దాకా విశ్రమించవు.

ప్రేమతో...

12 నవంబరు 2023 **బాలచంద్ర**

ఋషికేశ్.

# జ్యోత్స్న...
# వెలుగు బాటలో పయనం

1. అప్పుడెప్పుడో, దశాబ్ద కాలం క్రితం సంగతి
నన్ను హిమాలయాలకు తీసుకుని వెళ్ళాలని
కాలం గడిచింది... కార్యం నడిచింది అలాగే
జ్యోత్స్న సంకల్పం ఈడేరే సమయమొచ్చింది

2. ఎటు వెళుతున్నాం... ఏమి చేస్తున్నాం తెలీదు
జ్యోత్స్న వెలుగు బాటలో పయనమని తెలిసింది
మారు మాటాడ లేదు... విమాన యానం చేసాం
దేవభూమి ఉత్తరాఖండకు చేరినామిద్దరం

3. హిమాలయ స్వామి రామ ఆశ్రమము చేరాము
జీవితాంతము వారు చేసిన పనికది సాక్ష్యము
హిమాలయ ఆస్పత్రి... ఎన్నో విద్యాలయాలు
ఒక్కటిగా చేసే హిమాలయ విశ్వ విద్యాలయం

4. వందల ఎకరాల్లో విస్తరించిన ఆధ్యాత్మ రాజ్యం
స్వామిరామ గుండె లోతుల నుండి వికసించింది
ఆయన దేహాంతము దాకా నివసించిన క్షేత్రం
వారి శిష్యులు దీక్షా దక్షతతో నిర్వహిస్తున్నారు

5. జ్యోత్స్న ఆంతర్యం నన్ను సాధకుడు చేయాలని
జ్యోతిని ఎప్పుడో సాయి గుండెలో వెలిగించాడు
జవసత్వాలు ఉడిగే దాకా సేవలోనే పయనం
జరామరణాల భయం లేనిదయింది నా జీవనం

6. స్వామి రామ కేంద్రం సేవా స్వాంతన కలిగించింది
పావన గంగా తీరంలో మనసెంతో పవిత్రమైంది
ప్రతిక్షణం పరహితమే తప్ప స్వీయ సాధన లేదు
స్వామి రామ కేంద్రంలో కూడా సేవా సాధనయే

7. ఇంద్రియాలు... దేహము... మనసు... హృదయం
సేవాత్మ భావన కంటే అన్యము లేదని చెప్పింది
ప్రయత్నాలు ప్రయాణాలు ప్రమాణాలు ఫలితం
మాన్యం అయ్యింది... జ్యోత్స్న మనసు నొచ్చింది

8. కఠిన పదాలు... కారుణ్య భావాలు మార్చ లేదు
కఠోర సాధనకు ఒకింత కూడా దారి చూపలేదు
కొండలు కోనలు అరణ్యాలు హిమాలయాలు
దేహం తిరిగింది తప్ప సేవా దాహం తీరలేదు

9. జ్యోత్స్న నా కోసం ఎంతో ధనం ఖర్చు పెట్టింది
ఎంతో దయతో మార్గం చూపే ప్రయత్నం చేసింది
ప్రోత్సాహంతో నేను కరిగినా ఫలం శూన్యమైంది
ఒక్క క్షణం మనసు కుదుటుగా నిలవలేదు...

10. స్వామి రామను చూస్తే... నాకు సేవ కనిపించింది
తపకేశ్వరుని దర్శిస్తే సేవయే తపస్సుగ తోచింది
తడకేశ్వరుని తడితే, తప్పులేని పని చేయమంది
మోక్షమార్గాలెన్నో... సేవ కూడా త్రోవే అని తెలిసింది

11. ఋషికేశము... క్లేశములు తొలగించుటకు సేవ
హరిద్వారము... హరిని చేరగ సేవే ద్వారమని
గంగా ప్రవాహం... సేవను ప్రవాహం చేయాలని
ఉత్తరాఖండ్ ఉత్తమ గతికి మార్గమని తోచింది

12. ఎటు చూసినా... ఏది విన్నా... ఎవరిని చూసినా
సేవా దర్శనం మాత్రమే అవుతోంది అన్యం లేదు
జ్యోత్స్న చేసిన ఏర్పాట్లు కూడా సేవగా తోచింది
ఈ సేవా తపస్సుకు అంతం నా మరణమే నా?
సాధకురాలిగా... ధ్యానిగా... దాతగా...
జ్యోత్స్న సంకల్పం సిద్ధించాలని నేను సదా కోరుకుంటాను
సేవలో నేనేదైనా పుణ్యం సంపాదించి వుంటే
సోదరికి జన్మ రాహిత్యం చేకూరాలని ప్రార్థిస్తాను

ఈ 12 రోజుల సాధనా యాత్రలో, సోదరి జ్యోత్స్నకు తోడుగా వుండగలిగానని నా భావన. ఒక్కో రోజుకు ఒక కవిత చొప్పున 12 కవితా పుష్పాలు ఆవిడకు కృతజ్ఞతతో అర్పిస్తున్నాను.

ఒక తల్లిలా చూసుకుంది. ఎంతో ఆత్రుతతో నా సాధన గురించి పరితపించి పోయింది. రుషికేశ్‌లో ఉన్న 6 రోజులలో జన క్లేశములకు కారణమైన అరి షడ్వర్గముల గురించి నేను వ్రాసిన 6 వ్యాసములను సోదరి శ్రీమతి జ్యోత్స్నకు అంకితం చేస్తూ... ఈ వ్యాసాలు అందరికీ ఉపయోగపడే కరదీపికలు కావాలని కోరుకుంటున్నాను.

॥ సమస్త లోకాః సుఖినోభవంతు ॥

ప్రేమతో...

13 నవంబరు 2023 **బాలచంద్ర**

ఋషికేశ్.

**VIMUKHAM**
**Balachandra**



కోర్కె బ్రతికించు కొన్నాళ్ళు కొన్నేళ్ళు।
ఆశ బ్రతికించు నీవుండు దాకా॥
ఆశయమొక్కటేరా అమరత్వ మిచ్చేది।
వినుర బాలచంద్ర వినయ సాంద్రా॥


6-3-609/140/1, Anandnagar, Khairathabad,
Hyderabad - 500 004. Telangana

abhayafoundation@yahoo.com | abhaya@abhayafoundation.org

9592202450 | 8143707803

www.abhayafoundation.org | www.abhayahome.org

abhayafoundationHyd | abhaya Foundation-Home of Happiness

abhayaheart | abhayaheart


abhaya
FOUNDATION